# చీమలు పెట్టిన పుట్టలు...

"బోలో భారత్‌మాతాకీ"

"జై"

"బోలో మహాత్మాగాంధీకీ"

"జై"

★ ★ ★

"ఏమిట్రా అబ్బాయ్! ఆ జై జై ధ్వనాలు -- అవీనూ"

"గాంధీగారూ వాళ్ళు, సత్యాగ్రహం చేస్తున్నారే బామ్మా"

"అదేం ఆగ్రహంరా నాయనా"

"బ్రిటిష్‌వాళ్ళు మనల్ని ఇన్నాళ్ళూ బానిసలుగా చేసి పరిపాలిస్తున్నారుగదే - వాళ్ళని దేశం వదలి వెళ్ళిపొమ్మనీ, మన దేశానికి స్వరాజ్యం యివ్వాలనీ, సత్యాగ్రహం చేస్తున్నారు".

"అదేమిట్రా నాయనా - సీమ దొరలు మనల్ని బాగానే పరిపాలిస్తున్నారుగదా!"

"ఆఁ! బాగానే పరిపాలిస్తున్నారు! ఏమిటి మనల్ని బానిసలుగా చూడటమా - మన కష్టం మీద వాళ్ళ ఖజానా నింపుకోవటమా - వాళ్ళు మన దేశం వదిలేదాకా నిద్రపోము - స్వరాజ్యం మన జన్మహక్కు"

"అయితే సత్యాగ్రహం చేస్తే వాళ్ళు దేశం వదిలి పోతారా?"

"ఆహాఁ! వెళ్లితీరాలి. మహాత్మాగాంధీ నాయకత్వంలో జరిగే ఈ స్వరాజ్య పోరాటం ఆగదు. సర్దార్ పటేల్, కాశీనాధుని నాగేశ్వరరావ్, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, నెహ్రూ, రాజన్‌బాబు మొదలయిన వాళ్ళు ఈ ఉద్యమాన్ని నడిపిస్తున్నారు. నిస్వార్థంతో, ప్రజాక్షేమం కోసం చేసే ఏ ఉద్యమాన్నీ ఎవరూ ఆపలేరు-"

"మరి స్వతంత్రం వస్తే మనకేం లాభంరా నాయనా"

"లాభమా - భలేదానివే బామ్మా - మన దేశాన్ని మనమే పాలించుకుని ఆనందంతో, ఐశ్వర్యంతో తులతూగుతాం - దేశంలో పేదా సాదా అంటూ వుండదు. ప్రతివాడికి కావలసినంత తిండి, బట్టా, వుండటానికి చక్కటి యిల్లూ వుంటాయి - నిరుద్యోగులనేవాళ్ళు వుండరు - ఈ తెల్లదొరల ఆఫీసుల్లోలాగా, లంచాలు, అవినీతీ, బంధుప్రీతి ఏది వుండదు - ప్రతివాడూ ఈ పాడు యింగ్లీషు చదువులు మానేసి, మన సంస్కృతంలోనే చదువు కుంటారు - దేశంలో ధర్మం నాలుగు పాదాలా నడుస్తుంది - యీ దేశంలో మనుషులందరూ బానిసత్వం నించి బయటపడి, స్వేచ్ఛానాయువులు పీల్చుకుంటారు-"

"అయితే గాంధీగారు చేస్తున్న ఉద్యమం మనం కూడా ప్రోత్సహించవలసిందే".

"అంతేకాదు, ఈ త్యాగధనుల నిజాయితీని గ్రహించి ప్రతివాడూ మన ముందు వున్న బాధ్యతను గుర్తించి స్వతంత్ర పోరాటంలో పాల్గొనాలి-"

"అవునురా నాయనా, నువ్వు చెప్పింది నిజమే! మన దేశం సుఖ సంతోషైశ్వర్యాలతో తులతూగాలంటే స్వతంత్రం రావాలి-"

"బోలో స్వతంత్ర భారత్‌కీ".

"జై"

★ ★ ★

"బ్రిటిష్‌వాళ్ళు వెళ్లిపోయారు బామ్మా! మనకి స్వతంత్ర్యం వచ్చేసింది".

'నిజమా నాయనా! ఇంతమంది పడ్డ శ్రమా, చేసిన త్యాగం ఫలించాయన్నమాట.'

"అటు చూడు ! చిన్న చిన్న చీమలన్నీ కలసి అక్కడ వున్న పురుగూ, పుట్రలను బయటకు తోలి భద్రంగా, సుఖంగా వుండాలని చక్కటి పుట్టలు కట్టుకున్నాయి".

"అవును. మనం కూడా అలాగే శత్రువులను బయటకు తోలేసి స్వరాజ్యం సంపాదించుకున్నాం. ఇక సుఖానికి లోటు వుండదు!"

★ ★ ★

"తాతయ్యా! ఏమిటి ఆ అరుపులు".

"అబ్బా - అవి ఒకళ్ళు అరుస్తూన్నవి కావమ్మా! రకరకాలమంది రకరకాలుగా

అరుస్తున్న అరుపులు".

"నాకేం అర్థంకావటం లేదు తాతయ్యా! సరిగ్గా చెప్పు".

"అవా - చెపుతాను విను. విద్యార్థులేమో పరీక్షలు వద్దనీ, చదువుకోకుండా అందరూ పాసవాలనీ అరుస్తున్నారు. చదువులు అయిపోయినవాళ్లు ఉద్యోగాలు కావాలని అరుస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్నవాళ్లు జీతాలు పెంచమని అరుస్తున్నారు. ఆ ప్రక్కన అరుస్తున్న ఆడవాళ్ళేమో ధరలు తగ్గించమనీ, అవినీతిని అరికట్టమని అరుస్తున్నారు".

"మరి ఆ ప్రక్కనే మాట్లాడకుండా చూస్తూ నుంచున్నదెవరు తాతయ్యా!"

"వాళ్ళేనమ్మా ఈ దేశాన్ని నడిపిస్తున్న వాళ్ళు - కల్తీ వర్తకులు. వాళ్ళు నిత్యావసరాలన్నీ, అందకుండా దాచేసి, నల్లబజారులో డబ్బుచేసుకుంటూ వుంటారు. అన్ని వస్తువులనూ కల్తీ చేసి, సామాన్యుడ్ని పీల్చి రక్తం తాగుతుంటారు".

"మరి వాళ్ళను ఎవరూ పట్టుకోరా తాతయ్యా!"

"లేదమ్మా! పట్టుకోరు. వాళ్లవల్ల లాభాలు వుంటాయని, వాళ్ళని పట్టుకోరు".

"వాళ్ళ వల్ల ఏమిటా లాభాలు తాతయ్యా!"

"నీకు అవేవి అర్థంకావమ్మా! పెద్దయింతర్వాత తెలుస్తాయిలే".

"మరి తాతయ్యా!"

"మళ్ళీ ఏమిటమ్మా?"

"మరి మన యింటి ముందు ఆ ముష్టివాడెందుకు అరుస్తున్నాడలా"

"ఆకలేసి, వాడికి అన్నం కావాలమ్మా! పోతులాగా వున్నా వాడు పనిచేయడు. కష్టపడకుండా కడుపు నిండాలి ఈ బద్ధకస్తులకి".

"మరి ఆ బోర్డులు పట్టుకుని అరుస్తూ వెడుతున్నవాళ్ళెవరు తాతయ్యా?"

"వాళ్ళు ప్రాంతీయాభిమానులమ్మా! వాళ్ళు వాళ్ళకి తప్ప బయట వాళ్ళకి ఎవరకీ చదువుకు సీట్లు యివ్వవద్దనీ, ఉద్యోగాలివ్వవద్దని అరుస్తున్నారు"

"అంటే వాళ్ళకి వేరే రాజ్యం కావాలనా తాతయ్యా?"

"ఒకే దేశంలో వేరే రాజ్యం ఏమిటమ్మా! అలా అనకూడదు"

"ఆ ప్రక్కనే కారులో పోతున్నాయన ఎవరు తాతయ్యా? సీమదొరా?"

"అవునమ్మా! మొన్నటిదాకా చదువూ సంధ్యా లేక బలాదూరుగా తిరిగినవాడే ఇవాళ వాళ్ళ చుట్టం నాయకుడు అనగానే, వీడు సీమదొర అయిపోయాడు"

"మరి ఆ ప్రక్కన రిక్షా తొక్కుతున్న ముసలతను ఎందుకలా నవ్వుతున్నాడు?"

"అతను స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నాడులే అమ్మా! బహుశా ఆ పోరాటంలో పాల్గొన్న వాళ్ళను తల్చుకుని, ఏడవలేక నవ్వి వుంటాడు"

"సరిగ్గా చెప్పు తాతయ్యా! నాకేం అర్థం కావటంలేదు".

"నీకు అర్థం కాదులేకానీ, రేపు క్లాసులో అప్పచెప్పవలసిన పద్యం ఏదీ - చదువు"

"చీమలు పెట్టిన పుట్టలు పాముల..."